మట్టి గణపతే మహా గణపతి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- గణేశ్ ఉత్సవాల్లో డీజేకు అనుమతి లేదు
- ముషీరాబాద్ సీఐ రాంబాబు


సీఐ రాంబాబు

రాంనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ముషీరాబాద్ సీఐ జి.రాంబాబు హెచ్చరించారు. సోమవారం ఆయన గణేష్ నిబంధనలు, ఏర్పాట్లు, బందోబస్తు అంశాలను 'ఆంధ్రజ్యోతి'కి సీఐ వివరించారు. ముషీరాబాద్ పీఎస్ పరిధిలో 16 ఫీట్లకు పైన ఎత్తుగల 2 వేల మండపాలు ఉన్నాయని, 10 ఫీట్లపై గల గణపతి విగ్రహాలు 50 ఉన్నాయని, 5 ఫీట్ల వినాయక విగ్రహాలు ఉన్నాయని తెలిపారు. మండపాలను కరెంట్ వైర్లు, స్తంభాలకు దగ్గరగా లేకుండా ఏర్పాటు చేయాలని, వినాయకుల ఎత్తు, బరువును బట్టి స్టేజీ పటిష్ఠంగా నిర్మించాలని సూచించారు. మండపానికి వచ్చే భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపం వద్ద ఫైర్ సేఫ్టీ పరికరాలైన నీరు, ఇసుక ఇతర వాటిని అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు. ప్రతి మండపం వద్ద కానిస్టేబుల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పీఎస్ పరిధిలో నిమజ్జన ర్యాలీలో డీజే, ప్యాడ్ బ్యాండ్‌లకు ఎలాంటి అనుమతి లేదన్నారు. వేడుకల్లో పీఎస్ పరిధిలో తాను తమ డీఐ, ఐదుగురు ఎస్ఐలు, ఐదుగురు ఏఎస్ఐలు 12 మంది హెడ్ కానిస్టేబుల్, 48 కానిస్టేబుల్స్ బందోబస్తులో విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు.

నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి


డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని, మండపాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి సూచించారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈస్ట్‌జోన్‌లోని మొత్తం 10 పోలీస్‌స్టేషన్ల పరిధిలో మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద నిర్వాహకులు ప్రతిరోజూ ఒకరు, ఇద్దరు ఉండాలని సూచించారు. మండలపాల వద్ద ఎవరైనా అనుమానితులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గణేశ్ వేడుకలకు మొదటి విడతగా 330 మంది పోలీసు బందోబస్తుకు వచ్చారని తెలిపారు. మరి కొంత మంది వచ్చే నెల 2, 3వ తేదీలలో బందోబస్తుకు వస్తారని ఆయన తెలిపారు.

రేపటి నుంచి లక్ష్మీగణపతి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని ప్రసిద్ధిగాంచిన శ్రీ లక్ష్మీగణపతి దేవస్థానంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు వినాయకచవితి నవరాత్రి మహోత్సవాలు-2025 జరుగుతాయని ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో పి.లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం వారు ఆలయంలో మాట్లాడుతూ 27న ఉదయం 8 గంటలకు శ్రీ లక్ష్మీగణపతి స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అగ్నిప్రతిష్ఠ, గణపతిహవనం, సర్వాభరణములతో అలంకరణ, సాయంత్రం శమంతకోపాఖ్యానం, పురాణప్రవచనం ఉంటుందని తెలిపారు. 28న ఉండ్రాళ్ళపూజ, సింధూర అలంకరణ, 29న బిల్వార్చన, అన్నపూర్ణ, 30న భస్మార్చన, విభూతి అలంకరణ, 31న ఫలపంచామృతాభిషేకం, దూర్వార్చన , పుష్ప అలంకరణ, వచ్చేనెల 1న బిల్వార్చన, పసుపు అలంకరణ, 2న వివిధ పత్రపూజలు, పుష్పయాగం, 3న మహాలింగార్చన, 4 సకలసుగంధద్రవ్య పూజ, ఫల పంచామృత అభిషేకం, దీపాలంకరణ, 5న పుష్పయాగం, ఎదుర్కోళ్ళు, 6న శ్రీ అనంతపద్మనాభస్వామి వ్రతం, శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం, 7న మహా పూర్ణాహుతి, అఖండబలి, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం, తిరువీధి సేవ రథోత్సవం, 8న అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ చేయాలి

- బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్

బర్కత్‌పుర, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 29న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుని వెంటనే అమలు చేయాలని కోరారు. సోమవారం కాచిగూడ మోతిమార్కెట్‌లోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు అమలయ్యేంతా వరకు ఈ ఉద్యమం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు మహాసభ నాయకులు పాల్గొన్నారు.

కార్మికశాఖ అధికారులకు ఇతర శాఖల పనులు అప్పగించొద్దు

- సీఎంకు లేఖ రాసిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి భిక్షపతి

చిక్కడపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ అధికారులకు ఇతర శాఖల పనులు అప్పగించవద్దని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కార్మిక నాయకుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవసాని భిక్షపతి సోమవారం లేఖ రాశారు. ఉపాధికల్పనశాఖకు సంబంధించిన పనులు కార్మికశాఖ అధికారులకు చాలాకాలంగా అప్పగిచడంవలన కార్మికశాఖ అధికారులు, ఉన్నతాధికారులు ఎవ్వరూ కూడా కార్యాలయాల్లో అందుబాటులో ఉండడంలేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికశాఖ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందన్నారు. ప్రధానంగా ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ నుంచి మొదలుకుని జాయింట్ కమిషనర్, అడిషనల్ కమిషనర్‌ల వరకు ఎవ్వరూ కూడా కార్మికులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు అందుబాటులో ఉండడం లేదని అన్నారు. దీనివల్ల కార్మికుల పనులు, సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఐటీఐల్లో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల పనులపై కార్మికశాఖ అధికారులు తలమునకలై ఉన్నారని దీనివల్ల కార్మికశాఖ పనులు అన్నీ కూడా పెండింగ్‌లో పడ్డాయన్నారు. తక్షణమే ఉపాధికల్పన శాఖకు సంబంధించిన విధుల నుంచి కార్మికశాఖ అధికారులను తప్పించి పూర్తిస్థాయిలో కార్మికశాఖ విధులు నిర్వహించేలా సీఎం చొరవ తీసుకోవాలని లేఖలో పేర్కొన్నట్లు భిక్షపతి తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు

నల్లకుంట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖైరతాబాద్ ఒకినవా స్కూల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు శిహన్ శ్రీధర్ సీనియర్ మాస్టర్ శ్రీకాంత్ శిక్షణలో కాటాస్ విభాగంలో 14, కుమితే విభాగంలో ఒక బంగారు పతకం సాధించి సత్తా చాటారు. ఓల్డ్ బోయినపల్లిలో ఒకినవా సన్నీ మార్షల్ ఆర్ట్స్ సీనియర్ మాస్టర్ డోమినిక్ జీవేయర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్వీనసిటీ కరాటే పోటీల్లో ఈ బంగారు పతకం సాధించారని శ్రీకాంత్ సోమవారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన పీఈటీలు దివ్య, వర్ష తదితరులు విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేసి సత్కరించి అభినందించారు.

● తిరుమల వేంకటేశ్వరుని సన్నిధిలో..



తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని సోమవారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పి.శ్రీధర్‌చారి, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ నాయకులు కరికె కిరణ్, శ్రీనివాస్, కృపాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

\- ముషీరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో


జవహర్‌నగర్‌లో మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఏఎంవోహెచ్ ప్రవీణ తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. నీటిలో సులభంగా కరిగిపోయే మట్టివినాయక విగ్రహాలను పూజించాలని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ముఠా జైసింహ, ముడారపు రాకేష్‌కుమార్, పున్న సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, రవిశంకర్‌గుప్తా, కిరణ్‌కుమార్, నవీన్‌యాదవ్, రచ్చ నరేష్, సాయిచాణిక్యరెడ్డి, సాయియాదవ్, దీన్‌దయాళ్‌రెడ్డి, సురేందర్, జీహెచ్ఎంసీ సర్కిల్ 15 ఎఎంవోహెచ్ డా. ప్రవీణ, సూపర్‌వైజర్ సోమేష్, రాజకుమార్, సందీప్ పాల్గొన్నారు.

ఉచితంగా ప్రతిమల పంపిణీ

మట్టి గణపతే మహా గణపతి అని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని వక్తలు సూచించారు. సోమవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలోని పలు ఆలయ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.


భోలక్‌పూర్ భవానీశంకర ఆలయంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సురేష్ కుమార్ తదితరులు

భవానీశంకర ఆలయ ప్రాంగణంలో..

ముషీరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ దేవుని తోటలోని భవానీశంకర ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్ భక్తులకు ఉచితంగా మట్టి విఘ్నేశ్వరుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు విజయ్‌కుమార్, చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది సురేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి దేవాలయంలో


లక్ష్మీగణపతి దేవాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో మట్టి గణపతి విగ్రహాలను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పంపిణీ చేశారు. బీజేపీ నేతలు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, ఆలయ ఈవో లక్ష్మారెడ్డి చైర్మన్ నర్సింగ్ రావు, సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.


డీడీ కాలనీలోని ఎస్‌బీఐ పార్కులో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసిన కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, కె.వీరయ్య, రాజగోపాల్‌రెడ్డి తదితరులు

బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో..

నల్లకుంట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిందాబాద్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం సంస్థల ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని డీడీ కాలనీలోని ఎస్‌బీఐ పార్కులో ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి హాజరై విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ కాలనీ అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి కె.వీరయ్య, సినీ దర్శకుడు మల్లం రమేష్, కాలనీవాసులు పార్థసారధి, సుకుమార్, రాములు, టిల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో సోమవారం ప్రజలకు మట్టిగణపతి విగ్రహాలను స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పంపిణీ చేశారు.

కాచిగూడ డివిజన్‌లో..


కాచిగూడ డివిజన్‌లో మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లోని నింబోలిఅడ్డ, మోతిమార్కెట్, చప్పల్‌బజార్‌లలో ప్రజలకు మట్టి గణపతులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సుభాష్ పటేల్, క్షీరసాగర్, కృష్ణకుమార్, నర్సింగ్‌యాదవ్, బల్వీర్, భీమ్ రాజ్, ఆర్.సంతోష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తి, దేశభక్తిని పెంపొందిస్తున్న గణేశ్ ఉత్సవాలు

ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు దైవభక్తి, దేశభక్తిని పెంపొందిస్తున్నాయని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ హాల్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుల, వర్గాలకు అతీతంగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తూ హిందూ ధర్మాన్ని కాపాడాలని సూచించారు. ఆనాడు ఉద్యమపోరాటంలో భాగంగా సామూహిక వినాయక మండపాలను ఏర్పాటు చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లారని గుర్తు చేశారు. గణేశ్ మండప నిర్వాహకులకు అధికారులు సహకరించాలని కోరారు. భగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ.. భాగ్యనగరంలో లక్షకు పైగా గణేశ్ మండపాలను ఏర్పాటు చేస్తూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతిరోజూ రాత్రి 9గంటలకు వినాయ మండపాల వద్ద సామూహిక దీపారాదన చేయాలని సూచించారు. అనంతరం గణేశ్ నవరాత్రి ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సికింద్రాబాద్ కన్వీనర్ వినయ్ కుమార్, నియోజకవర్గ ఉత్సవ సమితి నాయకులు శక్తిసింగ్, పరిమళ్‌కుమార్, బుర్రా రాజ్‌కుమార్, ఎం.నవీన్ గౌడ్, ఆయూష్, బిజ్జిరవి, సలంద్రి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట కో-కన్వీనర్‌గా వెంకటేష్ దయాల్


వెంకటేష్ దయాల్‌కు నియామక పత్రం అందజేస్తున్న రమేష్ తదితరులు

నల్లకుంట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గ కో-కన్వీనర్‌గా బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు చెందిన వెంకటేష్ దయాల్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ అచ్చిని రమేష్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు పి.గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, భువనగిరి సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఆగమన్ ర్యాలీలో పాల్గొన్న అశోక్‌నగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

అశోక్‌నగర్‌లో గణేశ్ ఆగమన్ ర్యాలీ

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ సంజీవయ్యనగర్‌కు చెందిన అశోక్‌నగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 ఫీట్ల వినాయకుడి విగ్రహ ఆగమన్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. భారీ లైటింగ్ సెట్, భాజాభజంత్రీల మధ్య యువకుల డ్యాన్స్‌లు చేస్తూ గణనాథుడికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో గడ్డం రాజేశ్, కోళ్ళ సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు తదితరులు

రక్తదానంతో ఇతరులకు పునర్జన్మ

రాంనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానం వంటిదని, ఇది ఇతరులకు పునర్జన్మ కల్పిస్తుందని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థ కరస్పాండెంట్ డాక్టర్ సరోజ పేర్కొన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థలు, బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో విశ్వబంధుత్వ దినోత్సవం రాజయోగిని దాదీ ప్రకాశమణి 18వ స్మృతి దినం సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆక్టివిస్ట్ లింగా ప్రకాష్, బ్రహ్మకుమారీస్ చిక్కడపల్లి శాఖ ఇన్‌చార్జి బి.కె.జయశ్రీ, కళాశాల ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అరోరా కాలేజీలో..

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీస్ చిక్కడపల్లి శాఖ ఆధ్వర్యంలో విశ్వబంధుత్వ దినోత్సవం, రాజయోగిని దాది ప్రకాశమణి 18వ స్మృతిదినం సందర్భంగా సోమవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని అరోరా డిగ్రీ పీజీ కాలేజీలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ కేంద్రం చిక్కడపల్లి శాఖ హెడ్ జయశ్రీ, కాలేజీ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, ఐటీబీ సీజీఎం చంద్రమణి, తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ డా. పవన్, శోభ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ సందర్భంగా చిక్కడపల్లిలో అలర్ట్

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా క్యాంపస్‌లో సీఎం సభ సోమవారం నిర్వహించిన సందర్భంగా చిక్కడపల్లి పోలీసుల అలర్ట్‌గా వ్యవహరించారు. సీఎం సభను అడ్డుకునేందుకు పోటీపరీక్షల అభ్యర్థులు, నిరుద్యోగులు సమాయత్తమవుతారనే సమాచారంతో చిక్కడపల్లి లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఒక నిరుద్యోగిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వదిలేసినట్లు పోలీసులు తెలిపారు.

సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను అలవర్చుకోవాలి

- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ


బద్రుకా కళాశాల వజ్రోత్సవ వేడుకలలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఎంపీ కె.లక్ష్మణ్ తదితరులు

రాంనగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆధునిక విజ్ఞానంతో పాటు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను అలవర్చుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ విద్యార్థులకు సూచించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో బద్రుకా కళాశాల వజ్రోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ హాజరై బద్రుకా కళాశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రత్యేకంగా రూపొందించిన 75 ఏళ్ల స్మారక వెండి నాణెంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ వికసిత్ భారత్ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ లక్ష్మీనివాస్ శర్మ, కార్యదర్శి శ్రీకిషన్, రవి, రాజేంద్ర, ప్రొఫెసర్ అభిరాంకృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే కాలేరు


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు


చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు

అంబర్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచికంచారు. అంబర్‌పేట మండల పరిధిలోని 70 మంది షాదీ ముబారక్, 29 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు సోమవారం ఆలీకేఫ్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మంజీ ఎంపీ వి.హనుమంతరావు, చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎరమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా పేదల కోసం షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టి ఒక్కొక్కరికి లక్ష నూటపదహారు రూపాయలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మ, వై.అమృత, అంబర్‌పేట తహసీల్దార్ అన్వర్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి, ఖైరతాబాద్ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లలితగీతాల వ్యాప్తికి నవ్యనాటక సమితి పోటీలు దోహదం


ప్రసన్నలక్ష్మిని సత్కరిస్తున్న కేవీ రమణాచారి

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నవ్యనాటక సమితి వారు ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఏవీ సావిత్రి లలిత సంగీత పోటీలు లలితసంగీత వ్యాప్తికి దోహదం చేస్తున్నాయని ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి అన్నారు. నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో ఏవీ సావిత్రి లలితసంగీత పోటీల విజేతలకు బహుమతుల ప్రదానసభ సోమవారం త్యాగరాయగానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి ఆకాశవాణి సంగీత కళాకారిణి ప్రసన్న లక్ష్మిని సత్కరించి మాట్లాడారు. ఆకాశవాణి లలితసంగీత వ్యాప్తికి ఎంతోకృషి చేసిందన్నారు. గానసభలో కళల వికాసానికి 10 లక్షలు మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి వసుంధర నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సంగీతగురువు ప్రభాకర్, గాయని సురేఖ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని పాలు పాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీ ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. కృష్ణానగర్ పరిధిలో ఉదయం 10నుంచి 12 గంటల వరకు, చిక్కడపల్లి పరిధిలో మధ్యాహ్నం 2నుంచి 3.30 గంటల వరకు, గాంధీకుటీర్ పరిధిలో 3.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.

'బెస్ట్ అవలెబుల్' ఫీజు బకాయిలు విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

రాంనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో బెస్ట్ అవలెబుల్ పథకం కింద చదువుతున్న 25 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.210 కోట్లు వెంటనే విడుదల చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్, ప్రజా పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కే రూ.50 వేల కోట్లు ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివలింగం, సైదులు, వేదాంతమౌర్య, రాజేందర్, సంజీవ్, కల్పన, శారద, గోపీ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.